ఇది కలెక్టరేటే గురూ..!

తమ సమస్యల పరిష్కారానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు కలెక్టరేట్‌కు రావడం పరిపాటి. సమస్యల్ని సావధానంగా విన్న ఉన్నతాధికారులు వాటిని ఆయా విభాగాల అధికారులను పురమాయిస్తూ ఉంటారు. అయితే సాక్షాత్తు కలెక్టరేట్‌లోనే కొన్ని సమస్యలు తాండవిస్తున్నా అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- టాయిలెట్లలో చెత్త కుప్పలు..ఇసుక బస్తాలు
- ఊడిపడుతున్న శ్లాబ్ పెచ్చులు
- విరిగిపోయిన గోవింద నామాలు!
- పట్టించుకోని అధికారులు


టాయిలెట్స్‌లో చెత్తకుప్పలతోపాటు ఇసుక బస్తాలు


రేకులు పగిలిపోవడంతో వర్షం ఆగినా కార్యాలయాల ముందు నిల్వ ఉన్న నీరు

తిరుపతి అర్బన్: భక్తుల వసతి సౌకర్యం కోసం టీటీడీ నిర్మించిన పద్మావతి నిలయాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్ 4 నుంచి కలెక్టరేట్ కోసం తీసుకుంది. నూతన జిల్లాల ఏర్పాటుతో ప్రజల సౌకర్యార్థం దీనిని కలెక్టరేట్‌గా మార్చి అన్ని విభాగాలనూ ఒకే చోట కేంద్రీకృతం చేసింది. తిరుపతి జిల్లా ప్రజలకు ఇదెంతో అనువుగా ఉంటోంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడి చిన్నపాటి సమస్యల్ని విస్మరించింది.

మరుగుదొడ్లకు వెళితే అగచాట్లే

ప్రస్తుత కలెక్టరేట్ కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో గ్రీవెన్స్ చాంబర్‌కు సమీపంలో స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్స్ ఉన్నాయి. మొదటి అంతస్తులోని వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు టాయిలెట్స్ లేవు. వారంతా గ్రౌండ్ ఫ్లోర్‌కు రావాల్సిందే. అలాగే కలెక్టరేట్‌కు వివిధ సమస్యలపై వచ్చే వారు సైతం వాటినే వినియోగిస్తుంటారు. అయితే ఇప్పుడు వాటిలో చెత్తకుప్పలు, ఇసుక బస్తాలు వేసి ఉండడంతో టాయిలెట్లకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. నెలల కాలంగా ఈ సమస్య ఉంటోంది.

ఊడిపడుతున్న శ్లాబ్ పెచ్చులు

మరోవైపు కలెక్టరేట్‌లో వివిధ చోట్ల పలు అద్దాలు 50 శాతం వరకు పగిలి ఉన్నాయి. ఎవరైనా అటువైపు వెళుతూ పగిలిపోగా మిగిలిన అద్దాలు ఊడిపడితే ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఉంటోంది. వీటికి మరమ్మతులు చేయాల్సి ఉంది.


విరిగిన గోవింద నామాలు

టీడీపీ అతిథి భవనం నేపథ్యంలో కార్యాలయం ముందు వైపు పలుచోట్ల గోవింద నామాలను టీటీడీ అప్పట్లో ఏర్పాటు చేసింది. వీటిలో పలు గోవింద నామాలు విరిగిపోయాయి. వాటిని తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో శ్రీవారి భక్తులు ఇది చూసి ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు పలుచోట్ల శ్లాబ్ నుంచి చిన్న చిన్న పెచ్చులు ఊడిపడుతున్నాయి. అలాగే ఏడు అంతస్తుల్లోని కలెక్టరేట్ కార్యాలయంపై భాగంలోని రేకులు పగుళ్లు బారడంతో చిన్నపాటి వర్షం వచ్చినా పలు కార్యాలయాలు ఉరుస్తున్నాయి. దీంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ తర్వాత వర్షం ఆగినా వారాల పాటు ఆ నీళ్లు అలానే ఉంటున్నాయి. దీంతో దోమల బెడద తప్పడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

‘తిరుపతి బౌద్ధ క్షేత్రం’ ఆవిష్కరణ



తిరుపతి కల్చరల్: ప్రముఖ చరిత్ర కారులు, పురాతత్వ పరిశోధకుడు జమునాదాస్ రాసిన ‘తిరుపతి బౌద్ధ క్షేత్రం’ తెలుగులో భారత రాజ్యాంగం వంటి 16 పుస్తకాలను తిరుపతి అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ మాట్లాడుతూ, తిరుపతి బౌద్ధ క్షేత్రం పుస్తకంలో చరిత్రలో ఏం జరిగిందో రచయిత సవివరంగా గానీ తిరుమలను బౌద్ధులకు అప్పగించమని రాయలేదని తెలిపారు. ఈ పుస్తకం పలు భారతీయ భాషల్లోకి అనువాదమైందని, చివరిగా తన మిత్రుడు ఏఎస్.నాగేశ్వరరావు చక్కని తెలుగులోకి అనువాదం చేశారని తెలిపారు. ఆధార్ మాజీ డైరెక్టర్ జనరల్ పీఎస్ఎస్.మూర్తి, సమాంతర పబ్లికేషన్ అధ్యక్షుడు వరుణ్‌కుమార్ మాట్లాడారు. అనువాద రచయిత ఏఎస్. నాగేశ్వరరావు, రాజ్యాంగ పరిరక్షణ బాధ్యుడు పి.అంజయ్య, న్యాయవాది జి.కోదండరాం, పౌర చైతన్య వేదిక కార్యదర్శి ఏఎస్.పరమేశ్వరరావు, ఏఐవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.సంతోష్‌కుమార్, అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు డాక్టర్ పరమశివన్, కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడారు.

క్లుప్తంగా

బలిజలకు సముచిత స్థానం


మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్

తిరుపతి కల్చరల్: వైఎస్‌ఆర్‌సీపీ నూతన కమిటీ నియామకాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లా స్థాయిలో బలిజలకు సముచిత స్థానం కల్పించి భూమన కుటుంబం బలిజ పక్షపాతిగా నిలిచిందని ఆ పార్టీ జిల్లా అధికార పార్టీ ప్రతినిధి పసుపులేటి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. నూతనంగా నియమితులైన బలిజల నేతలను పరిచయం చేశారు. సమావేశంలో పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కరాటే శ్రీను, జిల్లా కోశాధికారి తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు కుమారి, యువజన విభాగం నగర అధ్యక్షుడు ఎల్.దినేష్ రాయల్, గ్రీవెన్స్ సెల్ నగర అధ్యక్షుడు మద్దాలి శేఖర్, అంగన్‌వాడీ విభాగం నగర అధ్యక్షురాలు సాయి పద్మజ, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐటీ వింగ్ సహాయ కార్యదర్శి చందురాయల్, సాంస్కృతిక విభాగం నగర అధ్యక్షుడు కె.వెంకటయ్య, యువజన విభాగం నేతలు కిరణ్ రాయల్, ప్రదీప్ రాయల్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి

పాకాల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా మాట్లాడుతూ బాలికలు అన్నింటా రాణించాలన్నారు. కళాశాలలో ప్రస్తుతం సమాజంలో బాలికలు, యువతులు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళా విభాగం సమన్వయకర్త డాక్టర్ మాధవి మాట్లాడుతూ బాలికలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్ష, అవమానాలు, దోపిడీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టికళావతి, అధ్యాపకులు రేఖ, విష్ణుప్రియ, మాధవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


బీటీఏ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో బాబ్జీ

పాకాల : బహుజన్ టీచర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం ఎంఈవో బాబ్జీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతిప్రసాద్, రామచంద్ర, గణేష్, విజయ్ మోహన్ రెడ్డెప్ప, వెంకటయ్య,, రామమూర్తి, శివప్రసాద్, కేశవరావు, సునీకర్ పాల్గొన్నారు.

ఆడపిల్లలకు రక్షణ కల్పిద్దాం



రామచంద్రాపురం: కుప్పంబాదూరు, అనుప్పల్లి, నెత్తకుప్పం ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బాలికా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. కుప్పంబాదూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజనకుమారి,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, పావనిశ్రీ, టీచర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

పాకాల : శంఖంపల్లె సమీపంలో రాజానాయుడు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి దుండగులు పగులగొట్టి కాపర్ వైరును చోరీ చేశారు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రక్తదానం


రక్తదాన శిబిరంలో అసోసియేషన్ సభ్యులు

తిరుపతి తుడా: ఆల్ ఇండియా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు జేఎస్ షిండే జన్మదిన సందర్భంగా ఏపీ అసోసియేషన్ సభ్యులు కరకంబాడి రోడ్డులోని బాలాజీ ఫెడ్‌టాప్ కెమిస్ట్ భవనంలో శుక్రవారం రక్తదానం చేశారు. అసోసియేషన్ శాఖ తిరుపతి అధ్యక్షులు పీవీ రత్నం, సెక్రటరీ రాముగుప్తా, ట్రెజరర్ నరసింహారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు

ముగ్గురికి జైలు, జరిమానా

తిరుపతి లీగల్: ట్రాక్టర్ ను నిర్లక్ష్యంగా నడిపి ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని మృతికి కారకుడైన కేసులో తిరుపతి, మంగళం, శెట్టిపల్లి పంచాయతీ, శ్రీ వెంకటేశ్వర కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కోదండరామనాయుడుకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు.

- కారును నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరు బెంగళూరు వాసుల మృతికి, మరో ఇద్దరికి గాయాలవడానికి కారణమైన కేసులో తిరుపతి, కరకంబాడి రోడ్డు, శ్రీపాద అపార్ట్మెంట్‌కు చెందిన కార్ డ్రైవర్ గిరిప్రసాద్‌కు 6నెలలు జైలు శిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ తీర్పు చెప్పారు.
- లారీ నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరి మృతికి కారకుడైన కేసులో బెంగుళూరుకు చెందిన లారీ డ్రైవర్ వాజిద్ కు 8 నెలలు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు.

తోపుడు బండ్లను తొలగించడం దుర్మార్గం


ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు, చిరు వ్యాపారులు

తిరుపతి కల్చరల్: ఏళ్ల తరబడి నగరంలో చిరు వ్యాపారాలతో జీవనం సాగిస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులను మున్సిపల్ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా బలవంతంగా తొలగించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి విమర్శించారు. తోపుడు బండ్ల తొలగింపును నిరసిస్తూ శుక్రవారం సీఐటీయూ నేతలు, తోపుడు బండ్ల వ్యాపారులతో కలిసి నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మురళి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరు వ్యాపారులపై దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. చిరు వ్యాపారుల తోపుడు బండ్లను కూటమి నేతలు జేసీబీలు, ట్రాక్టర్లతో బలవంతంగా తీసుకెళ్లడం ఎంతమాత్రమూ తగదన్నారు. జనసేన నాయకుల పేర్లు చెప్పి ఎక్కడబడితే అక్కడ ఫుట్‌బాత్‌లపై ఇనుప బంకులు పెడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ యువత తోపుడు బండ్ల వ్యాపారులను తొలగించి మంత్రి నారా లోకేష్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్నారా? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలకు తిరుపతిలో వీధి వ్యాపారుల అవస్థలు కనిపించలేదా? అని మండిపడ్డారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రమేష్, బాల, తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం నేతలు సాయి, మురళి, మునిరత్నం, దాము, రామాంజులు, సుబ్రమణ్యం , శ్రీనివాసులు, అశోక్, మంజుల, రఘు, పవిత్ర, మాధవి, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీలకు గీతం విద్యార్థిని


విద్యార్థిని త్రిపురాంబికను అభినందిస్తున్న కరస్పాండెంట్

తిరుపతి సిటీ: సెర్బియా దేశంలో మార్చి 19 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఫిడే ప్రపంచ పాఠశాల స్థాయి చదరంగం పోటీలకు తమ స్కూలు 8వ తరగతి విద్యార్థిని త్రిపురాంబిక అర్హత సాధించిందని గీతంపాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు ప్రపంచస్థాయి టోర్నమెంట్లలో ప్రతిభ చాటి 7.5పాయింట్లు సాధించి నగదు బహుమతులు అందుకుందని చెప్పారు.

శ్రీహరి మెడికల్ స్టోర్ నూతన బ్రాంచ్ ప్రారంభం


స్టోర్‌ను ప్రారంభిస్తున్న నగరి ఎమ్మెల్యే

తిరుపతి తుడా: స్థానిక ఎమ్ఆర్ పల్లి సర్కిల్ వద్ద శ్రీహరి మెడికల్ స్టోర్ నూతన బ్రాంచ్‌ను శుక్రవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. మెడికల్ స్టోర్ అధినేతలు వంశీ అబ్బూరి, శ్రావణ్ కుమారెడ్డి, వెంకటేశ్వర్లరెడ్డి మాట్లాడుతూ, తక్కువ ధరకు మందులు ఇస్తామని, స్టోర్ 24గంటలు పనిచేస్తుందని చెప్పారు.ఎలైట్ అధినేత కోడూరు బాలసుబ్రమణ్యం, విష్ణుశ్రీ అనుపత్రి అధినేత వెంకటముని, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ మీనాక్షి జైన్ పాల్గొన్నారు.

4 నుంచి బ్రహ్మోత్సవాలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం, ఇతర అధికారులు

తిరుపతి కల్చరల్: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలోని శ్రీపద్మావతి సమేత శ్రీప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో ఈనెల 29 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం, ఫిబ్రవరి 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికలను టీటీడీ పరిపాలనా భవనంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీటీడీ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ పి.వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్ పాల్గొన్నారు.

–4 నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు

శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. 3న సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్య ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. 4వ తేదీ ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు పల్లకి ఉత్సవం, 5న శేషవాహనం, హంస వాహనం, 6న ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహ వాహనం, 7న కల్పవృక్ష వాహనం, హనుమంత వాహన సేవ, 8న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలు, 9న సర్వభూపాల వాహనం, రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, ఇదే రోజు రాత్రి 10.30 గంటలకు గరుడ వాహనం సేవ నిర్వహిస్తారు. 10న ఉదయం 7 గంటలకు రథారోహణ, రాత్రి గజవాహనం, 11న పల్లకి ఉత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, 12న వసంతోత్సవం, రాత్రి ధ్వజావరోహణం, 13న సాయంత్రం 5 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించరా?


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెండు ఏళ్ల క్రితం రూ.80లక్షలు ఎంపీ నిధులు, కార్పొరేషన్ నిధులు రూ.1.40కోట్లు రైల్వే టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్ ఇచ్చారని, అయితే కాంట్రాక్టర్ పనిచేయకుండా కాలయాపన చేయడం దారుణమని 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌కే బాబు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన కమిషనర్‌ను కలసి వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. నిధులు మంజూరైనా రైల్వే బ్రిడ్జి పనులు చేయకపోవడం, కేబుల్ అడ్డుగా ఉన్నాయంటూ మున్సిపల్ అధికారులు అర్థరహితంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్పొరేటర్లు కె.ఆంజనేయులు, తాళ్లూరి ప్రసాద్, ఎస్సీ సెల్ నాయకులు నల్లని బాబు, ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు

ప్రైవేటు దూరవిద్య పరీక్ష కేంద్రాలను రద్దు చేయాలి


వీసీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో వచ్చే నెలలో డీడీఈ పరీక్షల కోసం ప్రైవేటు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం తగదని, వాటినే వెంటనే రద్దు చేయాలని కోరుతూ లా స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సుందరరాజు శుక్రవారం వీసీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ, ప్రైవేటు విద్యాసంస్థల్లో కేటాయించడంతో పేద విద్యార్థుల నుంచి యాజమాన్యాలు లక్షలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. వీటిని రద్దు చేసి ప్రభుత్వ విద్యాసంస్థలలోనే పరీక్షలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నిదానం కోటేశ్వరరావు, ఎన్ఎల్ఎస్ఏ జిల్లా నాయకులు ముకేష్, యోగేష్, పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేయాలి

ఎస్వీయూ పరిధిలో డీడీఈ పరీక్ష కేంద్రాల కేటాయింపులో అవినీతి చోటుచేసుకున్నట్లు వస్తున్న ఆరోపణలపై వాస్తవాలు వెలికి తీయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు వీసీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, అక్బర్, రవి, వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, వినోద్, అశోక్, గోపి, వెంకటేష్ పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం వితరణ


పేదలకు అల్పాహారం వడ్డిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: జేసీఐ తిరుపతి శాఖ శుక్రవారం మెటర్నిటీ ఆసుపత్రి వద్ద పేద రోగులు, వారి సహాయకులకు ఉచితంగా అల్పాహారం వితరణ చేసింది. ముఖ్య అతిథిగా బాలాజీ నర్సింగ్ కళాశాల చైర్మన్ ప్రవీణ్ హాజరై అల్పాహారం పంపిణీ చేసి మాట్లాడారు. సేవా నిరతితో జేసీఐ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మెటర్నిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ ఆర్ఆర్.రెడ్డి, జేసీఐ ప్రతినిధులు జీవన్, శంకర్, సోమయ్య, రమణ, గుణ, రాజేష్, భాస్కర్, వినయ్, పద్మనాభం, దిలీప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు


నగరంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: ప్రజలకు ఉపయోగకరమైన అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆటోనగర్, కృష్ణారెడ్డి కాలనీ, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ ఉమ, ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, మురుగు కాలువలు దెబ్బతిని నీరు రోడ్లపైకి వస్తున్నాయని, తాగునీరు ఒకే సమయంలో సరఫరా చేయాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఈ రమణ, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజి, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు.

వేలంపై అధికారులను నిలదీసిన కార్పొరేటర్లు

తిరుపతి తుడా: తిరుపతి కార్పొరేషన్ పరిధిలో కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ ఆలయం సమీపంలోని వినాయకసాగర్ వద్ద స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన వాణిజ్య సముదాయాల వేలం పాటపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అధికారులను నిలదీశారు. శుక్రవారం కమిషనర్ మౌర్య ఆధ్వర్యంలో జరిగిన వేలం పాట వివాదాస్పదంగా మారింది. ఎమ్మెల్యేతో కార్పొరేషన్ అధికారులు కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా కూటమి నేతలకు 14దుకాణాలను కేటాయించారని మండిపడ్డారు. అధికారులు స్పందిస్తూ, వేలం సక్రమంగా సాగిందని, గుడ్‌విల్ ప్రాతిపదికన దుకాణాలు కేటాయించినట్లు పేర్కొన్నారు.

కమిషనర్‌ను ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

షాపింగ్ కాంప్లెక్స్ వేలం విషయాన్ని కార్పొరేటర్ల దృష్టికి ఎందుకు తీసుకురాలేదని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎస్‌కే బాబు, కోటూరు ఆంజనేయులు, టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునిక్రిష్ణ కమిషనర్‌ను నిలదీశారు.


విజ్ఞానవంతులై ఉన్నత స్థాయికి..

– విద్యార్థులకు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పిలుపు


టెన్త్ విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: క్రమశిక్షణ, పట్టుదలతో విజ్ఞాన వంతులై ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. షంషాని ఫౌండేషన్ సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ సర్వీసు సంస్థ కార్యదర్శి ఎస్.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం టీపీపీఎం హైస్కూల్లో 62మంది పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్సీ చేతుల మీదుగా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ విద్యాసామగ్రినివ్వడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా సంస్థల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి, విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వైఎస్.బాబు, డాక్టర్ ఈశ్వర్ ప్రకాష్ మాట్లాడారు. చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. నిర్వాహకులు ఎస్.యువరాజ్ యాదవ్, ఢిల్లీబాబు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పి.భారతి, కె.గంగాధర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల అధికారులు పంచాయతీల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కుప్పంబాదూరు, కమ్మపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. జెడ్పీటీసీ ఢిల్లీరాణి మాట్లాడుతూ లైన్‌మన్లు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రాయలచెరువు ముంపు ప్రాంత రైతుల సమస్యను పరిష్కరించాలన్నారు. విద్యుత్ శాఖ ఏఈ గిరి మాట్లాడుతూ పీఎం సూర్యఘర్‌లో భాగంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ ఆదేశాల మేరకు అనుప్పల్లి వైపు నూతనంగా బస్సు సర్వీసు ప్రారంభించినట్లు ఆర్టీసీ ప్రతినిధి శంకర్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిరమ్మ, తహసీల్దార్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భాషకు తొలి గురువు తల్లే

- ప్రాథమిక విద్య ప్రాంతీయ భాషల్లోనే కొనసాగించాలి
- భారతీయ భాషా సంఘం జాతీయ సదస్సులో వక్తల పిలుపు

తిరుపతి సిటీ: ప్రతి భాషకు తొలి గురువు తల్లేనని, విభిన్న భాషలతో భిన్నత్వంలో ఏకత్వంగా భారత్ వెలుగుతోందని జాతీయ సదస్సులో విద్యాసంస్థల వీసీలు, డైరెక్టర్లు అన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, భారతీయ భాషా సంఘం, జాతీయ సంస్కృత వర్సిటీ ఏబీఎస్ఆర్ఎమ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ‘ఎస్వీయూలో భారతీయ భాషా సంఘం’ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఐజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య, వేదిక్, ఎస్ఎస్‌యూ, ఎస్వీయూ, మహిళా వర్సిటీ వీసీలు ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి, జీఎస్ఆర్ కృష్ణమూర్తి, సీహెచ్ అప్పారావు, ప్రొఫెసర్ ఉమ, ఏబీఎస్ఆర్ఎమ్ జాతీయ సహాయ సంఘటన కార్యదర్శి జీ.లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు వైవీ.రామిరెడ్డి అతిథులుగా ప్రారంభించి ప్రసంగించారు. భారతీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతోంది మాతృభాషలేనని, యువత మాతృభాష సంరక్షణకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు.

భాషా సంస్కృతి పెరగాలి



దేశంలోని మాతృభాషలకు ప్రాధాన్యత పెరగాలి. జర్మనీ, జపాన్, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాలలో ఇప్పటికీ మాతృభాషలోనే విద్యాబోధన కొనసాగుతోంది.

–ప్రొఫెసర్ శాంతను బట్టాచార్య, డైరెక్టర్, ఐజర్

మనుగడలోనే 590 భాషలు



దేశంలో సుమారు 2వేల భాషలు ఉండగా ఇప్పటికీ 590 భాషలు మనుగడలో ఉండడం విశేషం. వీటిలో అనేక భాషలకు మాండలికాలు ఉన్నాయి.

–ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి, వీసీ, ఎస్వీ వేదిక్ వర్సిటీ

మాతృభాషలే..



భారతీ సంస్కృతికి మాతృభాషలు నిలువుటద్దం. ప్రపంచంలోనే భిన్నత్వంలో ఏకత్వంగా భారత దేశం గుర్తింపు పొందడానికి కారణం భారతీయ మాతృభాషలే.

–ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వీసీ, జాతీయ సంస్కృత వర్సిటీ

ప్రాంతీయ భాషల్లో ఉన్నత విద్య పుస్తకాలు



ఉన్నత విద్యలో సైతం ప్రాంతీయ భాషలలో బోధించే విధంగా 31 విభాగాలకు సంబంధించి పుస్తక ప్రచురణకు భాషా సంవర్ధన సమితి ముందుకు రావడం విశేషం.

–ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

ఆది గురువు అమ్మే



అన్ని భాషలకు ఆది గురువు అమ్మే. ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలోనూ మహిళలు తమ మాతృభాషలతో సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకునని భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

–ప్రొఫెసర్ వీ.ఉమ, వీసీ, మహిళా వర్సిటీ


మాతృభాషలకు ప్రాముఖ్యత



భారత పౌరులు మాతృభాషలో సంభాషిస్తూ, భవిష్యత్ తరానికి భాషా ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన అవసరం ఉంది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే మాతృభాషలకు ప్రాముఖ్యత పెరగాలి.

–జీ.లక్ష్మణ్, ఏబీఆర్ఎస్ఎమ్, జాతీయ సహాయ సంఘటన కార్యదర్శి

బోధన మాతృభాషలోనే..



ఉన్నత విద్యలో తెలుగు సబ్జెక్ట్ కొనసాగించాలి. మాతృభాషలోనే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రాథమికను బోధించాలి. భాషాభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం చొరవ చూపడం శుభపరిణామం.

–ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ఏబీఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరుపతి : 99516 02971

చంద్రగిరి : 95055 17845